క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం



విరాళం అందజేస్తున్న నాగేశ్వరరావు దంపతులు

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు మాతుర్తి నాగేశ్వరావు దంపతులు రూ.10,008 విరాళం అందజేశారు. గురువారం ఆలయ సిబ్బంది సూరిబాబుకు ఈ విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా దాతను ఆలయ మర్యాదలతో స్వామివారి చిత్ర పటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

విద్యాకానుక కిట్ల పంపిణీ



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు

ఐ.పోలవరం: కేశనకుర్రు గ్రామ పంచాయతీ పరిధి కేశనకుర్రుపాలెం జెడ్పీ పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, సర్పంచ్ బీర సత్యకుమారి, స్కూల్ చైర్మన్ వై.మాధురీలత తదితరుల చేతుల మీదుగా గురువారం కిట్లు అందజేశారు. ఇందుకూరి రంగరాజు, కాశి పరివాజ్ కుమార్, ఆదినారాయణ, వెంకటేశ్వరావు, రవికిరణ్, సుబ్బరాజు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కాట్రేనికోన: ఇటీవల పితృవియోగంతో బాధపడుతున్న కాట్రేనికోన-4 ఎంపీటీసీ సంగాని మునీంద్రను ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పరామర్శించారు. ఎంపీటీసీ తండ్రి సంగాని వీర్రాజు కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. ఆయన చిత్ర పటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శ్రద్ధాంజలి ఘటించిన నాయకుల్లో నడింపల్లి సూరిబాబు, నల్లా నరసింహమూర్తి, సంగాని గణపతి, సంగాని పోతురాజు, సంగాని శివ కుమార్ తదితరులు ఉన్నారు.

నేడు వలంటీర్లకు వందనం

అమలాపురం టౌన్: మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం ప్రదానం చేయనున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు తెలిపారు. మున్సిపల్ చైర్పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన జరగనున్న ఈ సభకు రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ హాజరవుతారని కమిషనర్ నాయుడు తెలిపారు.

19 నుంచి వారాహి నవరాత్రులు

అమలాపురం టౌన్: స్థానిక నల్లవంతెన- ఎర్ర వంతెన మధ్య గల దక్షిణేశ్వర కాలభైరవ శక్తి స్థల్‌లో ఆషాఢ పాడ్యమి సందర్భంగా ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకూ వారాహి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు గౌతమ మహర్షి అక్షయ పాత్ర ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా శక్తి స్థల్ ప్రాంగణంలో వారాహి అమ్మవారి తైల వర్ణ ధ్వజాన్ని అక్షయ పాత్ర ప్రతినిధులు గురువారం ఆవిష్కరించారు. నవరాత్రి ఉత్సవాల్లో తొమ్మిది రోజులపాటు నిర్విరామంగా వారాహి హోమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో అక్షయ పాత్ర ప్రతినిధులు గొవ్వాల అచ్యుతరామయ్య, లింగోలు పండు, తూము దొరబాబు, నల్లా శ్రీదేవి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎంపీపీ పరామర్శ

తాళ్లరేవు: భార్య వియోగంతో బాధపడుతున్న తాళ్లరేవు మాజీ ఎంపీటీసీ సభ్యుడు గంజా సూరిబాబును ఎంపీపీ రాయుడు సునీత గురువారం పరామర్శించారు. గంజా లక్ష్మి ఆకస్మిక మృతికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎంపీపీ వెంట వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు రత్న ముత్యాలరావు, నాయకులు కుడుపూడి మల్లేష్, కాశీ, నూకరాజు, నాని, ప్రకాశ రావు, గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు చేయూత

అమలాపురం రూరల్: నల్లజర్ల మండలం అనంతపల్లి ఫ్లై ఓవర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆత్రేయపురం మండలం వెలిచేరు గ్రామం ఊదాలమ్మ గౌడ పాలెంకు చెందిన ఏడుగురు గౌడ కుటుంబీకులు మృతి చెందారు. ఆయా బాధిత కుటుంబాలకు సర్దార్ పాపన్న గౌడ్ కోనసీమ గౌడ సంక్షేమ సంఘం రూ.50వేలు నగదును కోనసీమ గౌడ సంఘ అధ్యక్షుడు రాజులపూడి భీముడు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మట్ట సత్తిబాబు, దాసరి చిన్న, పరమట సత్యనారాయణ, దాసరి శ్రీను,రాజులపూడి సత్యనారాయణ, కామన గంగాధరరావరు, వంకా ప్రసాద్, దాసరి సాయిబాబు, వంకా శ్రీను పాల్గొన్నారు.

బెల్టు షాపుపై అధికారుల దాడి

కాట్రేనికోన: పల్లం పంచాయతీ లోతు కాలువలో గురువారం బెల్టు షాపుపై ఎస్ఈబీ అధికారులు ఆకస్మికంగా దాడి చేసి 180 ఎంఎల్ 80 (డీపీఎల్) ప్రభుత్వ మద్యం బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. బెల్టు షాపు నిర్వహిస్తున్న మల్లాడి నరసింహమూర్తిని అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు.

విత్తన ఎంపికే కీలకం

- ధ్రువీకరించిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని అధికారుల సూచన
- ఖరీఫ్‌లో 46 ఎకరాల్లో సాగు

ముమ్మిడివరం: సాగులో విత్తనాల ఎంపికే కీలకమైంది. విత్తు బాగుంటే దిగుబడి బాగుంటుంది. సరైన విత్తనాలను ఎంపిక చేసుకుకోకపోతే దిగుబడి తగ్గి నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. రకరకాల వరి విత్తనాలలో రైతులు ఎంపిక చేసుకునే సమయంలో తగు జాగ్రత్తలు వహించాల్సి ఉంటుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ముమ్మిడివరం, అమలాపురం వ్యవసాయ సబ్ డివిజన్ల పరిధిలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 46వేల ఎకరాలకు పైగా వరి సాగు చేస్తున్నారు. నూరు శాతం కాలువల ద్వారా ప్రవహించే సాగునీటి ద్వారానే సాగు జరుగుతుంది. ముంపు ప్రభావం ఉండే ప్రాంతాల్లో స్వర్ణ రకం వరి సాగు అనుకూలంగా ఉంటుంది. వివిధ రకాల భూములు, వాతావరణ పరిస్థితులను బట్టి రెండు పంటలు పండించుకొనే ప్రాంతాల్లో మంచి దిగుబడి ఇచ్చే వరి రకం స్వర్ణ విత్తితే బాగుటుంది. ఇది తక్కువ నత్రజనితో అధిక దిగుబడిని ఇస్తుంది. పంట చేతికొచ్చే సమయంలో చేలల్లో గింజ మొతకెత్తే స్వభావం తక్కువగా ఉంటుంది. చౌడు భూములలో సాగుకు ఇది అనుకూలంగా ఉంటుంది.160 రోజుల్లో పంట చేతికొచ్చే బాడవ మూసూరి (పీఎల్‌పి) 1100 రకం నీరు నిల్వ ఉండే పల్లపు ప్రాంతాలకు అనుకూలం. వర్షాధారం ఆరుదల పంటకు అనువుగా ఉండే ఎంటీయూ 9993 రకం వరిని సాగు చేసుకోవచ్చు. సొసైటీలతోపాటు అధికృత డీలర్ల వద్ద విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి.



ముమ్మిడివరంలో డీలర్ వద్ద సిద్ధంగా ఉన్న విత్తనాలు

విత్తనాలు కొనుగోలులో తీసుకోవల్సిన జాగ్రత్తలు

ధ్రువీకరించిన మేలు రకపు విత్తనాలను ప్రభుత్వ విత్తనాభివృద్ధి సంస్థల నుంచి గాని, పరిశోధనా సంస్థల నుంచి గాని, లైసెన్సు కలిగిన డీలరు నుంచి గాని మాత్రమే కొనుగోలు చేయాలి.

- గుర్తింపు పొందిన సంస్థలు సర్టిఫైడ్ చేసిన విత్తనాలనే కొనాలి.
- దళారులు చెప్పిన విత్తనాలు కొనుగోలు చేస్తే నష్టాలు వస్తాయి.
- వ్యవసాయా శాఖ అనుమతి పొందిన డీలరు వద్ద మాత్రమే కొనుగోలు చేస్తే ఇబ్బందులు తలెత్తినప్పుడు ప్రశ్నించే అవకాశముంటుంది.
- విత్తన మొలక శాతం పరీక్షించుకోవాలి
- విత్తనాల సంచితోపాటు లాట్‌నెంబర్, కాల పరిమితి తప్పని సరిగా సరిచూసుకోవాలి. విత్తన సంచిని, ట్యాగ్‌ను, బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకూ భద్ర పర్చుకోవాలి.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి



మంచి విత్తనాలు ఎంపిక చేసుకోవడం ద్వారా మంచి దిగుబడి సాధించవచ్చు. విత్తనాలు మొలక శాతాన్ని పరీక్షించి నారుమడులు వేయాలి. అధికృత డీలర్లు, ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. విధిగా డీలరు ఇచ్చే బిల్లులను రైతులు జాగ్రత్తగా భద్రపర్చుకోవాలి. ఖరీఫ్ సీజన్‌లో స్వర్ణ రకం వరి సాగు అనుకూలంగా ఉంటుంది.

-ఎస్.ప్రశాంతకుమార్, ఏఓ, ముమ్మిడివరం

ముత్యాలమ్మకు పూజలు

తాళ్లరేవు: గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా గురువారం అమ్మవారిని నిలబెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాడమాసంలో పుట్టింటి ఆడపడచుగా అమ్మవారిని తీసుకువచ్చి నెలరోజుల పాటు అంగడి గుడిలో ఉంచి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం ఆషాడమాసం ముగింపు రోజున అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించి తీసుకొస్తారు. తొలకరి వ్యవసాయ పనులు ప్రారంభం నుంచి అమ్మవారిని పూజిస్తే పంటలు బాగా పండుతాయని రైతులు నమ్మకంగా ఏటా ఉత్సవం నిర్వహిస్తుంటారు.

రైల్వే కౌంటర్ కోసం వినతి

అమలాపురం టౌన్: గత 22 ఏళ్లుగా స్థానిక మున్సిపల్ సర్క్యులర్ బజార్‌లో ఉంటున్న రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను యథావిధిగా ఉంచేందుకు మున్సిపాలిటీ చర్యలు చేపట్టాలని కోనసీమ రైల్వే సాధన సమితి (కేఆర్ఎస్ఎస్) ప్రతినిధులు మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడికి గురువారం సాయంత్రం వినతిపత్రం అందించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను సమితి అధ్యక్షుడు డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం, ప్రతినిధులు కల్వకొలను తాతాజీ, సప్పా నాగేశ్వరరావు, ఉప్పుగంటి భాస్కరరావు, ఆర్వీ నాయుడు, ఎరగర్త వెంకటేశ్వరరావు, బీఎస్ మూర్తి తదితరులు కలిసి వినతిపత్రం అందించారు. ఈనెల 27న జరిగే కౌన్సిల్ అజెండాలో ఈ అంశాన్ని చేర్చుతామని, కౌన్సిల్ దీనిపై నిర్ణయం తీసుకుంటుందని కమిషనర్ నాయుడు చెప్పారు.

రాష్ట్ర కాపునాడు కార్యనిర్వాహక అధ్యక్షుడిగా అబ్బిరెడ్డి

అమలాపురం టౌన్: రాష్ట్ర కాపు నాడు కార్యనిర్వాహక (వర్కింగ్) అధ్యక్షుడిగా అమలాపురానికి చెందిన అబ్బిరెడ్డి సురేష్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు పురంశెట్టి మంగారావు రాజమహేంద్రవరంలో నియామక పత్రాన్ని సురేష్‌కు బుధవారం రాత్రి అందజేశారు. రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్ర కాపు నాడు కార్యవర్గ సమావేశంలో సురేష్‌ను రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇంత వరకూ సురేష్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాపునాడు అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా సురేష్ అమలాపురంలో గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించడంతో కృతజ్ఞతలు తెలిపారు. కాపుల అభ్యున్నతి తన వంతు కృషి చేస్తానని అబ్బిరెడ్డి పేర్కొన్నారు.

ఆగస్టులో కిమ్స్ స్మార్క్ సమావేశాలు

అమలాపురం రూరల్: అమలాపురం కిమ్స్ వైద్య కళాశాలలో ప్రతి సంవత్సరం మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న దక్షిణ భారత వైద్య విద్యార్థుల వార్షిక ప్రయోగాత్మక అవగాహన సమ్మేళనం (స్మార్క్) సమావేశాలు ఈ సంవత్సరం ఆగస్టు 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకూ జరుగుతాయని కిమ్స్ కళాశాల డీన్ డాక్టర్ ఆనంద్ ఆచార్య తెలిపారు. స్మార్క్ సదస్సు పోస్టర్‌ను కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు, ఎండీ రవి కిరణ్‌వర్మ, డీన్ డాక్టర్ ఆనంద్ ఆచార్య కళాశాల విద్యార్థుల సమక్షంలో గురువారం విడుదల చేశారు.

బాధితుడికి రూ.25 వేల సాయం

గుడ్ సీడ్ ఫౌండేషన్ వితరణ

అమలాపురం టౌన్: రోడ్డు ప్రమాదంలో కాలికి తీవ్ర గాయమై చికిత్స పొందుతున్న అమలాపురంలోని ఓ వస్త్ర దుకాణంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న గులాం అబ్బాస్ హుస్సేన్‌కు గుడ్ సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు కుంచే రమణరావు రూ.25 వేలు సాయంగా సమకూర్చారు. మామిడికుదురు మండలం నగరానికి చెందిన హుస్సేన్ రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్యానికి ఆర్థికంగా పడుతున్న ఇబ్బందులను ఉప్పలగుప్తం వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు గుడ్ సీడ్ ఫౌండేషన్ దృష్టికి తీసుకుని వెళ్లారు. గురువారం అమలాపురంలోని ఫౌండేషన్ కార్యాలయంలో అధ్యక్షుడు రమణారావు బాధితుడి కుటుంబ సభ్యులకు రూ.25 వేల సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉప్పలగుప్తం ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, ఫౌండేషన్ సభ్యులు గంటా లక్ష్మీ ప్రసాద్, నేరుడుమిల్లి శ్రీనివాసరావు, కుంచే అర్జున్ తదితరలు పాల్గొన్నారు.



బాధితుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న రమణారావు తదితరులు

పేదల అభ్యున్నతికే నవరత్నాలు

ఓడలరేవులో గడపగడపకూ మన ప్రభుత్వం

అల్లవరం: బలహీన వర్గాల అభ్యున్నతిని కాంక్షిస్తూ నవర్నతాలను ప్రవేశపెట్టి, వివక్షతకు తావులేకుండా పారదర్శకంగా అర్హత గల లబ్ధిదారుల చెంతకే సంక్షేమ పథకాలను చేర్చుతున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ అన్నారు. ఓడలరేవులో గురువారం సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ అధ్యక్షతన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా, వర్గ బేధాలు లేకుండా అందరికీ పథకాలు అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాదు, సొసైటీ చైర్మన్ చొల్లంగి రాధాకృష్ణ, పులుసుగంటి రాజేశ్వరీ, తహసీల్దార్ సాంబశివప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల వర్మ, అవనిగడ్డ శేషగిరిరావు, సర్పంచ్‌లు, రాకాపు విజయలక్ష్మి, బర్రె సీతారత్నం, ఎంపీటీసీ రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.



ఓడలరేవులో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న శ్రీకాంత్

‘ఒక పార్వతి.. ఇద్దరు దేవదాసులు’ సినిమా షూటింగ్

అమలాపురం టౌన్: మాయస్మృతి ప్రొడక్షన్స్ బేనర్‌పై రూపు దిద్దుకుంటున్న ‘ఒక పార్వతి... ఇద్దరు దేవదాసులు’ సినిమా షూటింగ్ అమలాపురం గాంధీ నగర్‌లోని ఓ ఇంట్లో జరుగుతోంది. పూర్తి ప్రేమ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్ మొత్తం 35 రోజులు కోనసీమలో పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించనున్నట్టు దర్శకుడు రామకృష్ణ తోట తెలిపారు. నాలుగు భాషల్లో చిత్రాన్ని నిర్మిస్తున్నట్టు తెలిపారు. గాంధీనగర్‌లోని రియల్టర్, బిల్డర్ మండేల బాబి ఇంట్లో గురువారం చిత్రానికి సంబంధించిన పలు సన్నివేశాలను చిత్రీకరించారు. చిత్రానికి ఇద్దరు హీరోలుగా దిలీప్, సిద్దార్థ మీనన్, హీరోయిన్‌గా రాశి సింగ్ నటిస్తున్నారు. హీరో దిలీప్, తల్లి దండ్రులకు సంబంధించి పలు సన్నివేశాలను ఆ ఇంట్లో చిత్రీకరించారు. నాలుగు రోజులపాటు అమలాపురరం పరిసర ప్రాంతాల్లో షూటింగ్ నిర్వహించి వారం రోజుల తర్వాత కోనసీమలోని పలు ప్రాంతాల్లో షూటింగ్ నిర్వహిస్తామని చిత్ర దర్శకుడు రామకృష్ణ తోట తెలిపారు.



షూటింగ్‌లో ఓ సన్నివేశం

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- ఎంపీపీ సునీత
- పైపులైన్ నిర్మాణ పనులకు భూమిపూజ

తాళ్లరేవు: తీరప్రాంత గ్రామాల్లో ఉన్న తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామని, దానికి అధిక నిధులు కేటాయిస్తున్నట్టు ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. గురువారం కోరంగి పంచాయతీ పరిధిలోని పెదబొడ్డు వెంకటాయపాలెంలో రూ.23 లక్షలతో నిర్మించనున్న తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులకు స్థానిక సర్పంచ్ పెయ్యల మంగేష్‌తో కలిసి ఎంపీపీ రాయుడు సునీత భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ముమ్మిడివరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ చేసిన కృషి ఫలితంగా తాగునీటి సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. పైపులైన్ నిర్మాణానికి రూ.15 లక్షల మండల పరిషత్ నిధులు, గ్రామ పంచాయతీ నుంచి రూ.8 లక్షలు కేటాయించినట్టు తెలిపారు. ఓవర్‌హెడ్ ట్యాంకుకు అనుబంధంగా ఈ పైపులైన్ నిర్మించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పాలెపు పోశియ్య, పోతుల రత్నకుమారి, రాయుడు గంగాధర్, పంచాయతీ కార్యదర్శి రామరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ తాడిచర్ల మారుతీరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లాడి శ్రీనివాస్, గ్రామ ఉపసర్పంచ్ కామాడి భైరవమూర్తి, వార్డు సభ్యులు కాటవేణి, కృష్ణవేణి పాల్గొన్నారు.



పైపులైన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ సునీత

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

కాట్రేనికోన: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్య నేరమని, కఠిన చర్యలు తీసుకుంటామని కాట్రేనికోన వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. గురువారం కాట్రేనికోనలో వెంకట సుబ్రహ్మణ్య ట్రేడర్స్ విత్తన విక్రయ దుకాణాన్ని ఆయన తనిఖీ చేశారు. విత్తనాలు నమూనాలు సేకరించి విత్తన పరీక్ష కేంద్రానికి పరీక్ష నిమిత్తం పంపించానన్నారు. మండలంలో ఆర్బీకేలు, ప్రైవేటు విత్తన విక్రయ కేంద్రాలలో 260 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలు 80 శాతం మొలకలు వస్తే మంచివిగా రైతులు గుర్తించాలన్నారు.

విస్తృతంగా జన్ భాగిదారి ర్యాలీ

కాట్రేనికోన: మండలంలోని జన్ భాగిదారి ర్యాలీలు విస్తృతంగా జరిగాయి. గురువారం 101 అంగన్‌వాడీ కేంద్రాల సూపర్‌వైజర్లు పర్యవేక్షణలో కార్యకర్తలు, ఆయాలు, పిల్లల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు నాయకులతో అవగాహన సదస్సు నిర్వహించారు. సూపర్ వైజర్ తులసీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం కాట్రేనికోన, పల్లంకుర్రు, కందికుప్ప, చెయ్యేరు సర్పంచులు గంటి వెంకట సుధాకర్, నాతి అలివేణి, చల్లగల వెంకటలక్ష్మి, సూపర్ వైజర్ ఎల్‌వీ రమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



కాట్రేనికోన ర్యాలీలో అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు

వృద్ధుల సంరక్షణ బాధ్యత వారసులదే

- జిల్లా ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ శాస్త్రి
- ప్రపంచ పెద్దల దుర్వినియోగ అవగాహన దినోత్సవం

అమలాపురం టౌన్: అమలాపురంలో ఏవీఆర్ నగర్‌లోని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా శాఖ కార్యాలయంలో ప్రపంచ పెద్దల దుర్వినియోగ అవగాహన దినోత్సవం సందర్భంగా గురువారం విశ్రాంత ఉద్యోగులంతా వృద్ధుల సంరక్షణపై చర్చించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పారుపూడి కృష్ణ శాస్త్రి మాట్లాడుతూ వృద్ధుల సంరక్షణ బాధ్యత వారి వారసులైన కొడుకులదేనని గుర్తు చేశారు. ఆ బాధ్యత నుంచి వారసులు తప్పించుకోవాలని ప్రయత్నించడం అమానుషమని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులైన తల్లిదండ్రులను విస్మరించి ఇబ్బంది పెడితే చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. వృద్ధులను వారసులు పట్టించుకోకపోవడం వల్ల వారు ఒంటరితనంతో ఆత్మస్థైర్యాన్ని కోల్పోయి ఆందోళన, అనారోగ్యాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. జిల్లా పెన్షనర్ల అసోసియేట్ అధ్యక్షుడు ఎం.సాయి వర ప్రసాదరావు మాట్లాడుతూ ఈ ఏడాది ‘అడ్రసింగ్ జండర్ బేస్డ్ వయెలెన్స్’ అనే నినాదంతో ప్రపంచ పెద్దల దుర్వినియోగ అవగాహన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. వృద్ధుల శ్రేయస్సు దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం 2007లో తల్లిదండ్రులు- పెద్దల పోషణ, సంక్షేమ చట్టం అమల్లోకి తెచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. తల్లిదండ్రులను పట్టించుకోని వారసులకు మూడు నెలల వరకూ జైలు శిక్ష, రూ.5 వేల వరకూ జరిమానా విధించే అవకాశముందన్నారు. చట్ట ప్రకారం వృద్ధులు తమ సమస్యలపై ఆర్డీవో కోర్టుకు నేరుగా వెళ్లి ఆ అధికారికి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. అనంతరం వృద్ధులను ప్రేమిద్దామని విశ్రాంత ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేకేవీ నాయుడు, అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు టీవీ శర్మ, సీహెచ్ కృష్ణమూర్తి, మండలీక ఆదినారాయణ, మెహబూబ్ షహీరా తదితరులు ప్రసంగించారు.



అమలాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

ఎంపీడీవో ప్రసాద్‌కు సన్మానం

అమలాపురం రూరల్: మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేసిన కాశీ విజయప్రసాద్ కాకినాడ జిల్లా పరిషత్ ఏఓగా బదిలీ అయ్యారు. ఆయన సేవలను గుర్తిస్తూ అభినందన కార్యక్రమాన్ని గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రసాద్‌ను శాలువా కప్పి, పూలమాలలతో ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి సత్కరించారు. జిల్లా కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు రుద్రరాజు సూరప రాజు, సర్పంచ్‌లు కరాటం ప్రసన్న తిరుకోటి సుజాత, ఎంపీటీసీ చొల్లంగి సుబ్బిరామ్ ఏవో కుమారి, తదితరులు సత్కరించారు.

దిశ యాప్‌పై మెగా డ్రైవ్



దిశ యాప్‌పై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వీరబాబు

అల్లవరం: మహిళలకు రక్షణ కల్పించే దిశ యాప్‌పై అల్లవరం పోలీసులు బోడసకుర్రు జాతీయ రహదారిపై గురువారం మెగా డ్రైవ్ నిర్వహించారు. సీఐ వీరబాబు ఆధ్వర్యంలో జాతీయ రహదారిలక్ష ప్రయాణించే వాహనదారులను ఆపి వారి మొబైల్‌లో దిశ యాప్‌ని డౌన్‌లోడ్ చేయించారు. యాప్‌పై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ దిశ యాప్‌ని మొబైల్‌ల్లో అప్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎస్సై శ్రీను నాయక్, ఏఎస్సై జంగా సత్యనారాయణ, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

స్మారక క్రికెట్ టోర్నీ విజేత సీ సోల్జర్స్ జట్టు



బహుమతుల ప్రదానోత్సవంలో పాల్గొన్న క్రికెట్ జట్లు

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో కొల్లు వర్మ, రేవు భయ్యాచౌదరి టీ 10 మెమోరియల్ క్రికెట్ టోర్నీ విజేతగా సీ సోల్జర్స్ నిలిచింది. గురువారం స్థానిక మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానంలో జరిగిన ఫైనల్స్‌లో కేవీఆర్ జట్టును సీ సోల్జర్స్ జట్టు ఓడించింది. ఈ నెల 12 నుంచి మూడు రోజుల పాటు జరిగిన స్మారక క్రికెట్ టోర్నీలో యానాం పరిసర ప్రాంతాల నుంచి 14 క్రికెట్ జట్లు పాల్గొనగా పోటీ హోరాహోరీగా సాగింది. విజేత జట్టుకు ఎస్సై శేరు నూకరాజు, ఎస్ఎస్‌పి ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రోహిత్, సురేష్, నిఖిల్, దత్తు, సాయి పాల్గొన్నారు.

మట్టపర్తి వారిపాలెంలో అగ్నిప్రమాదం

అమలాపురం రూరల్: బండారులంక మట్టపర్తి వారి పాలెంలో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. విద్యుత్ వైర్లు కొబ్బరి, తాటి చెట్లకు తగిలి మంటలు చెలరేగాయి. ఈ మంటలతో సమీపంలోని కొబ్బరి వ్యర్థాలకు వ్యాపించాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు సకాలంలో మంటలను అదుపు చేశారు. దీంతో సమీపంలోని పీచు ఫ్యాక్టరీకి పెద్ద ప్రమాదం తప్పింది.

ప్రవేశ పరీక్షతోనే నర్సింగ్ అడ్మిషన్లు

యానాం: ప్రవేశ పరీక్ష ఆధారంగా మాత్రమే బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో అడ్మిషన్లు నిర్వహించాలని ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ నిర్ణయం మేరకు ఈ విద్యాసంవత్సరం నుంచే దీనిని అమలు చేయాలని పుదుచ్చేరి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే 2023-24 విద్యా సంవత్సరంలో ఇంటర్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పించేందుకు అనుమతించాలని ఐఎన్‌సీకి ఏప్రిల్‌లో ప్రభుత్వం లేఖ రాసింది. అయినప్పటికీ ఐఎన్‌సీ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించాలని చెప్పింది. దీంతో జూలైలో ప్రవేశపరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

పూరిపాకలు దగ్ధం

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని చొల్లంగిపేట గాలమ్మోరు గుడి వద్ద బుధవారం రాత్రి మూడు పూరిపాకలు దగ్ధమయ్యాయి. రహదారి చెంతనే ఉన్న ఈ పాకల్లో పెంకే చెల్లాయమ్మ, ఆమె కుమారుడు దుర్గా ప్రసాద్ హోటల్ నిర్వహిస్తుండగా, కట్టా సత్తిబాబు సైకిల్ రిపేరు దుకాణం, కట్టమేసు సూరిబాబు చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నారు. రాత్రి 11 గంటల సమయంలో పాతకక్షల నేపథ్యంలో పలువురు ఘర్షణకు దిగారని, ఆ తరువాతే ఈ ప్రమాదం జరిగినట్టు చెప్తున్నారు. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే హోటల్‌లో రిఫ్రిజిరేటర్, గ్రైండర్ వంటి సామాన్లతోపాటు ఆహార పదార్థాలు అగ్నికి ఆహుతయ్యాయి. మూడు షాపులకు సంబంధించి సుమారు రూ.లక్షకు పైగా ఆస్తినష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు.

ఘనంగా బాపట్ల ఎంపీ పుట్టిన రోజు వేడుక

అమలాపురం రూరల్: బాపట్ల ఎంపీ, పార్లమెంటు డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు నందిగం సురేష్ పుట్టినరోజు వేడుకను గురువారం నడిపూడిలో ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్స్ పంచారు. బడుగు శీను, పెదపూడి ఏడుకొండలు, యార్లగడ్డ రవీంద్ర, నవరపు కన్న, తొత్తరమూడి బాబులు, చెల్లూరి బాలకృష్ణ వెంకటేశ్వరరావు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

ఎంపీ సురేష్ అభిమానుల రక్తదానం

అమలాపురం టౌన్: బాపట్ల ఎంపీ నందిగం సురేష్ ఫాలోవర్స్‌కు చెందిన యువకులు గురువారం స్థానిక బుద్ధా బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. అలాగే హరి మనో వికాస దివ్యాంగుల కేంద్రంలో అన్నదానం చేసినట్టు జిల్లా సురేష్ ఫాలోవర్స్ ప్రతినిధులు నేదునూరి ప్రసాద్, ఉందుర్తి సత్తిబాబు, పెదబాబు రాంబాబు తెలిపారు. గత 75 సంవత్సరాల చరిత్రలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మాదిగల తలరాతను మార్చుతూ ముఖ్యమంత్రి జగన్ ప్రోత్సాహంతో ఎంపీ నందిగం సురేష్ కోనసీమలో బొమ్మి ఇజ్రాయిల్‌కు ఎమ్మెల్సీ పదవి రావడానికి కృషి చేసిన మాదిగల అభిమాని అని ఫాలోవర్స్ ప్రతినిధులుపేర్కొన్నారు. మాదిగ యువకులు ఎం.ఉమామహేశ్వరరావు, ఉదయ్‌కుమార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీ యంత్రాలకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: పుదుచ్చేరి వ్యవసాయశాఖ, రైతు సంక్షేమ శాఖ ద్వారా యానాం నియోజకవర్గంలోని రైతాంగానికి కేంద్ర ప్రభుత్వ పథకం సబ్-మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెషినైజేషన్(ఎస్ఎంఏఎం) ద్వారా రాయితీపై యంత్రాలు కొనుగోలుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు గురువారం వ్యవసాయశాఖ డీడీ ఆర్.గణేషన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జనరల్, ఎస్సీ కేటగిరి రైతాంగానికి ట్రాక్టర్లు, పవర్‌టిల్లర్లు, వరి ఊడ్పు యంత్రం, రోటో వేటరు, పవర్ వీడరు, బెయిలర్(ఎండుగడ్డి చుట్టు యంత్రం), డ్రోన్ యంత్రాల కోసం ఈనెల 27లోగా తమ దరఖాస్తులను అందజేయాలని తెలిపారు.